రికార్డు స్థాయిలో ఓపెనింగ్స్

'బాగున్న సినిమాను ప్రేక్షకులు తప్పకుండా చూస్తారు. దానిని ఎవరూ ఆపలేరు. అది చరిత్ర. ప్రతి ఏడాది సంక్రాంతి సినిమాల విషయంలో నిర్మాతల మధ్య చిన్నపాటి వార్స్ జరుగుతూనే ఉంటాయి. బిజినెస్ ఛాలెంజెస్‌లో అవన్నీ ఓ భాగం. అంతేకానీ ఇక్కడ ఎవరికి ఎవరు శత్రువులు ఉండరు' అన్నారు అగ్ర నిర్మాత దిల్ రాజు. మహేష్ బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన 'గుంటూరు కారం' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ నిర్మించారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దిల్‌రాజు మాట్లాడుతూ 'రాత్రి ఒంటిగంట షోస్‌కు మిశ్రమ స్పందన లభించింది. వాస్తవాలేమిటో తెలుసుకోవడానికి సుదర్శన్ థియేటర్ వెళ్లి సినిమా చూశాను. తల్లీకొడుకు సెంటిమెంట్, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో సంక్రాంతి సీజన్‌లో ఇంటిల్లిపాది చూసే పర్‌ఫెక్ట్ మూవీ అనిపించింది. ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. పండగ తర్వాత సినిమా ఎంత వసూళ్లు సాధించిందో తెలుస్తుంది' అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'మేం ఊహించిన దానికంటే అద్భుతమైన స్పందన లభిస్తున్నది. తొలిరోజు రికార్డు స్థాయిలో ఓపెనింగ్స్ లభించాయి. తొలుత మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ ఈవినింగ్ షోస్‌కు అంతా సమసిపోయి పాజిటివ్ ట్రెండ్ కనిపించింది. ఫ్యామిలీ ఆడియెన్స్ బాగా చూస్తున్నారు. చక్కటి సెంటిమెంట్, పాటలు, వినోదం అంశాలతో సంక్రాంతి మూవీగా ఆకట్టుకుంటున్నది' అన్నారు.

'హను-మాన్' చిత్రాన్ని ప్రదర్శించండి

నైజాం ప్రాంతంలో ముందస్తుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం కొన్ని థియేటర్లలో 'హను-మాన్' చిత్రాన్ని ప్రదర్శించడంలేదని, ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతూ 'హను-మాన్' చిత్ర డిస్ట్రిబ్యూటర్స్ మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాత నిరంజన్ రెడ్డి తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలిలో (టీఎఫ్‌పీసీ) ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై టీఎఫ్‌పీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో శనివారం ప్రెస్‌నోట్‌ను విడుదల చేసింది. ''హను-మాన్' చిత్రాన్ని ఈ నెల 12 నుంచి ప్రదర్శించేందుకు తెలంగాణలోని కొన్ని థియేటర్లతో మైత్రీ మూవీ డిస్ట్రిబూటర్స్ ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే అగ్రిమెంట్‌ను బేఖాతరు చేస్తూ పలు థియేటర్లలో సినిమాను ప్రదర్శించడం లేదు. దీనివల్ల చిత్ర నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లకు ఎంతో నష్టం జరిగింది. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం చిత్రాన్ని వెంటనే థియేటర్లలో ప్రదర్శించాలి. ఇప్పటివరకు జరిగిన ఆర్థిక నష్టాన్ని భరించాలి' అని నిర్మాతల మండలి ప్రెస్‌నోట్‌లో పేర్కొంది. తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన 'హను-మాన్' చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకొచ్చింది.

స్టంట్ మాస్టర్స్ దర్శకత్వంలో..

కమల్‌హాసన్

అగ్ర నటుడు కమల్‌హాసన్ వరుసగా సినిమాలను అంగీకరిస్తున్నారు. ప్రస్తుతం ఆయన 'ఇండియన్-2' చిత్రంతో పాటు మణిరత్నం దర్శకత్వంలో 'థగ్‌లైఫ్'లో నటిస్తున్నారు. హెచ్.వినోద్ డైరెక్షన్‌లో ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్ త్వరలో పట్టాలెక్కనుంది. ప్రభాస్ 'కల్కి' చిత్రంలో కమల్‌హాసన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఇలా భారీ ప్రాజెక్ట్స్ ఆయన చేతిలో ఉన్నాయి. తాజాగా ఆయన ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ అన్బు-అరివును దర్శకులుగా పరిచయం చేస్తూ ఓ సినిమా చేయబోతున్నారు. 'కే హెచ్ 237' వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ కమల్‌హాసన్ తన ఎక్స్ (ట్విట్టర్)లో ఓ వీడియోను విడుదల చేశారు. అన్బరివు ప్రస్తుతం దేశంలో అగ్రశ్రేణి స్టంట్ మాస్టర్స్‌గా కొనసాగుతున్నారు. 'కే జీఎఫ్' సిరీస్‌తో పాటు ఇటీవల విడుదలైన 'సలార్'కు వాళ్లే యాక్షన్ డైరెక్షన్ చేశారు. కమల్‌హాసన్ 'విక్రమ్' చిత్రాన్ని అన్బు-అరివు స్టంట్స్ మాస్టర్స్‌గా పనిచేశారు. ఆ సినిమా యాక్షన్ సీక్వెన్స్‌కు మంచి పేరొచ్చింది. ఆ సినిమా సమయంలో వారిద్దరి ప్రతిభకు మెచ్చిన కమల్‌హాసన్ దర్శకులుగా అవకాశమిచ్చారని చెబుతున్నారు.

తెలంగాణ హత్యోదంతమే 'కిల్లర్ సూప్'

జనవరి 13న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన వెబ్ సిరీస్ 'కిల్లర్ సూప్'. ఇందులో మనోజ్ బాజ్‌పేయి, కొంకణ సేన్ శర్మ నటించారు. 2017లో తెలంగాణ రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లాలో కలకలం రేపిన ఓ హత్యోదంతాన్ని ఆధారంగా చేసుకొని తెరెక్కించిన సిరీస్ ఇది. 'ఉడ్తా పంజాబ్' ఫేమ్ అభిషేక్ చౌబే దర్శకత్వం వహించిన ఈ సిరీస్ పూర్తి యథార్థ ఘటనను కాకుండా పాక్షిక సమాచారాన్ని తీసుకొని తెరెక్కించినట్టు మేకర్స్ వెల్లడించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఓ వ్యాపారిని ఆయన భార్య ప్రియుడితో కలిసి హత్య చేయడం, తర్వాత ప్లాస్టిక్ సర్జరీ ద్వారా ప్రియుడి ముఖాన్ని భర్త ముఖంలా మార్చి తప్పించుకోవాలని చూడడం వంటి అంశాలను తెరకెక్కించారు. శాఖాహారి అయిన యువతి ప్రియుడు ఆసుపత్రిలో మటన్ తినడానికి నిరాకరించడంతో ఈ హత్యోదంతం వెలుగు చూసింది. ఈ సంఘటనల ఆధారంగా ఈ సిరీస్‌ను తెరకెక్కించారు.

కిల్లర్ సూప్‌లో ఓ సన్నివేశం

అసలైన వినోదానికి చిరునామా

అగ్ర కథానాయిక కీర్తి సురేష్ పట్టిందల్లా బంగారమవుతున్నది. గత రెండేళ్లుగా ఈ భామకు మంచి విజయాలు దక్కుతున్నాయి. తెలుగులో గత ఏడాది 'భోళా శంకర్' 'దసరా' భారీ సక్సెస్ సాధించాయి. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో నాలుగు సినిమాలున్నాయి. అందులో 'రఘుతాథ' సినిమా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. రాజకీయాంశాల నేపథ్యంలో కామెడీ సినిమాగా తెరకెక్కిస్తున్నారు. 1980 నేపథ్య కథ ఇది. శనివారం ట్రైలర్‌ను విడుదల చేసారు. ఇందులో హిందీ భాష వ్యతిరేక ఉద్యమంలో పాల్గొనే మహిళగా కీర్తి సురేష్ పాత్రను చూపించారు. తన మాతృభాష తప్ప వేరే ఏ భాషను అర్థం చేసుకోలేక సతమతమయ్యే యువతిగా ఆమె క్యారెక్టర్‌లో చక్కటి వినోదం పండింది. 'నేను నటించిన పూర్తిస్థాయి కామెడీ చిత్రమిది. ఈ సినిమాలో నేను చేసే సాహసాలు, ఈ క్రమంలో పండే వినోదం కడుపుబ్బా నవ్విస్తుంది. సినలైన వినోదానికి చిరునామా ఇది' అని కీర్తి సురేష్ పేర్కొంది. సుమన్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు.

సంక్రాంతి సంబురాలకు సిద్ధంగా ఉండండి

రెబల్ స్టార్ ప్రభాస్, మారుతి కాంబోలో సినిమా గురించి మేకర్స్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్, టైటిల్‌ను సంక్రాంతికి ప్రకటించనున్నారు. గతంలో ఎన్నడూచూడని అవతారంలో ప్రభాస్‌ను చూడాలని అభిమానులు ఎంతో ఉత్సుకతతో ఉన్న తరుణంలో తాజా అప్‌డేట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'సంక్రాంతి రోజు సూర్యోదయంతో పాటు రెబల్ స్టార్ కూడా త్వరగా మీ అందరికీ డబుల్ ట్రీట్ ఇవ్వనున్నారు. టైటిల్, ఫస్ట్ లుక్ జనవరి 15న ఉదయం 7.08 గంటలకు ఆవిష్కరించనున్నాం. ప్రభాస్ పొంగల్ ఫెస్ట్‌కు సిద్ధంగా ఉండండి' అంటూ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ట్వీట్ చేసింది. ఉదయించే సూర్యుడు, అరుస్తున్న కోడిపుంజుతో టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ పోస్ట్ చేసింది. 'వింటేజ్ డార్లింగ్ ప్రభాస్ మీ ముందుకు వచ్చేస్తున్నారు' అని పేర్కొంది. ఈ సినిమా హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కుతోంది. చాలా కాలం తర్వాత ప్రభాస్ ఫుల్ ఫన్ ఉండే క్యారెక్టర్ చేస్తున్నాడు. హీరోలను సరికొత్తగా ప్రజెంట్ చేస్తారనే పేరున్న దర్శకుడు మారుతితో కలిసి ప్రభాస్ చేస్తున్న ఈ పాన్ ఇండియా మూవీని టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించారు. ఇందులో ముగ్గురు హీరోయిన్లు నటిస్తున్నారు. మాళవిక మోహనన్, రిద్ధికుమార్, నిధి అగర్వాల్ ప్రభాస్ సరసన ఆడిపాడనున్నారు. సంజయ్ దత్ ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. డిసెంబర్‌లో విడుదలకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. ప్రభాస్ ప్రస్తుతం నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వస్తున్న 'కల్కి' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. 'కల్కి' మేలో వస్తున్నందున మారుతి-డార్లింగ్ కాంబో మూవీని ఏడాది చివరన తేవాలన్నది ఆలోచన. సంవత్సరానికి రెండు రిలీజ్‌లు ఉండేలా చూస్తానని అభిమానులకు ఇచ్చిన మాట నెరవేరేలా దర్శకుడు ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. 2023లో 'ఆదిపురుష్', 'సలార్-సీజ్ ఫైర్' రాగా, ఈ ఏడాది 'కల్కి'తోపాటే రేపు టైటిల్ ప్రకటించనున్న ఈ చిత్రం రావొచ్చు. ఆ తర్వాత 'సలార్-2', 'స్పిరిట్'తోపాటు దర్శకుడు హను రాఘవపూడితో మరో ప్రాజెక్టు క్యూలో ఉండనే ఉన్నాయి.

ఏదో దైవశక్తి మమ్మల్ని నడిపిస్తోంది

తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన 'హనుమాన్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. నిరంజన్ రెడ్డి నిర్మించారు. సంక్రాంతి కానుకగా ఈ నెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేశారు. ఈ సినిమా సక్సెస్ నేపథ్యంలో హీరో తేజ సజ్జా శనివారం విలేకరులతో మాట్లాడుతూ పలు విశేషాలు చెప్పారు. ''ప్రేక్షకులతో కలిసి ప్రీమియర్ షో చూశాను. అన్ని చోట్ల నుంచీ ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వస్తోంది. నేనెవరో తెలియని ఇతర భాషల ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా సర్‌ప్రైజింగ్‌గా ఉంది. చిరంజీవి గారు 'కంగ్రాట్స్ మై బాయ్. సో ప్రౌడ్ ఆఫ్ యూ' అని మెసేజ్ పెట్టారు. విజయాన్ని ఆస్వాదిస్తూనే ఇంకా ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. బెంగళూరు, చెన్నై, ముంబయి వెళ్తున్నాం. యూఎస్ వెళ్లే ఆలోచన కూడా ఉంది. 'హనుమాన్' నా కెరీర్‌లో బెంచ్ మార్క్ చిత్రంగా నిలిచిపోతుంది. ఈ విజయం ప్రేక్షకులందరిది. అందరికీ కృతజ్ఞతలు. ఏదో దైవశక్తి మమ్మల్ని నడుపుతోందని బలంగా నమ్ముతున్నాను. తప్పకుండా నాలుగు వారాలకుపైగా ఆడే చిత్రమని ముందే నమ్మాం. అందుకే సినిమా విడుదలకు 10 రోజుల ముందు అసలు ఒత్తిడి తీసుకోలేదు. నిర్మాత నిరంజన్‌రెడ్డి గారు మాపై చాలా నమ్మకం ఉంచారు. నటుడిగా లొకేషన్‌లో నాకు ఏదైనా చెప్పాలనిపిస్తే మొహమాటం లేకుండా చెప్తాను. దర్శకుడు ప్రశాంత్ వర్మ గారు ఇన్‌పుట్ ఎవరు చెప్పినా వింటారు. ఈ సినిమాలో యాక్షన్ స్టంట్స్ అన్నీ ఒరిజినల్‌గా చేసినవే. అండర్ వాటర్ సీక్వెన్స్, క్లైమాక్స్‌లో గాల్లో ఉండే సీక్వెన్స్ ఇవన్నీ రియల్‌గా చేశాం. ఎయిర్ సీక్వెన్స్‌లో పొడ్డున మేకప్ వేసుకొని రోప్ ఎక్కితే సాయంత్రానికే దిగేవాణ్ని. హనుమ విగ్రహంతో చేసిన షాట్‌కు ఆర్నెల్ల సమయం పట్టింది. వరలక్ష్మీ శరత్‌కుమార్ గారు గ్రేట్ యాక్టర్. పెద్ద నటితో పనిచేయడం ద్వారా చాలా నేర్చుకునే అవకాశం దక్కింది. 'హనుమాన్' జర్నీలో ఓపికగా ఉండటం నేర్చుకున్నాను. నా కొత్త సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభించబోతున్నాం. వివరాలు త్వరలో తెలియజేస్తాను' అన్నారు.